# ఒక్క సంవత్సరంలో బైబిలు గుండా

ఒక్క సంవత్సరంలోగా బైబిలు చదవాలని తీర్మానించుకున్నావా? "ఈ సంవత్సరం బైబిలు చదవడంలో నేను సీరియస్‌గా ఉండాలని" నీవు ఎప్పుడైనా అనుకున్నావా? మనలో చాలామందికి ఏమి చేయాలో తెలుసు, కాని బైబిలును చదవడం, తదేకంగా దానిని పఠించడాన్ని గురించి మనలను మనం క్రమబద్ధం చేసుకోడం కష్టం.

రాబోయే పన్నెండు నెలల్లో, ఆదికాండమునుండి ప్రకటనవరకు బైబిలంతటిని పఠించడంలో నిమగ్నం కావాలని కోరుతున్నాను. ఈ పాఠాలు 66 పుస్తకాల మీద అవగాహన కలిగిస్తాయి. ఈ పఠనానికి నీవు బద్ధుడవయితే ఇంతకు మునుపెన్నడూ ఎరుగని పరిజ్ఞానం దేవుని వాక్యంలో కలుగుతుంది.

వ్యక్తిగతమైన ప్రయోజనానికిని, వ్యక్తిగతమైన ఎదుగుదలకును వైయక్తికమైన ఆసక్తి తాళపు చెవియైయుంటుంది. చదువవలసిన ప్రతి పుస్తకంనుండి సెలెక్ట్ చేయబడిన లేఖన భాగాలను నీవు చదవాలి. నీవు ఈ అధ్యాయాలు చదివి, వాటిని మననం చేస్తే, ప్రతి పాఠము నీకు మంచి ప్రయోజనాన్నిస్తుంది.

నియమింపబడిన పఠనంలో, రోజుకు మూడు, నాలుగు అధ్యాయాలు నీకు పరిమితి చేయబడతాయి. ప్రతి పుస్తకంలో మంచి ఉదాహరణలను నీకు యిది యిస్తుంది, కాని అనేక అధ్యాయాలను గ్రహించకుండా వదలుతుంది. నీవు వదిలిన ప్రతి అధ్యాయాన్ని వెనక్కి మరలి మళ్ళీ చదవాలి. బైబిలు మొత్తాన్ని చదవడంలో మహా సంతృప్తి, విలువ ఉంటుంది.

మొత్తం బైబిలు అంతటితో పరిచయం కలిగి ఉండడంలో గల విలువ 2 తిమోతి 3:16, 17లో సూచింపబడింది: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది." "ప్రతి లేఖనము" అనేదానిలో క్రొత్త నిబంధన లేఖనాలు కూడ చేర్చబడ్డాయి (2 పేతురు 3:15, 16), కాని సందర్భము ప్రత్యేకించి పాత నిబంధన లేఖనాలను గూర్చి మాట్లాడింది (2 తిమోతి 3:14, 15 చూడు). బైబిలునుండి సంపూర్ణమైన ఉపయోగం పొందాలనుకుంటే, మనము పాత, క్రొత్త నిబంధనలతో పరిచయం గలవారమై యుండాలి.

అలా అన్నంత మాత్రాన, నేడు మనం పాత నిబంధన క్రింద ఉన్నామని దాని అర్థం కాదు. "నిబంధన" అని తర్జుమా చేయబడిన గ్రీకు మాటకు "ఒడంబడిక" లేక "ఒప్పందం" అని అర్థం. పాత నిబంధన దేవునికిని, ఇశ్రాయేలీయులకును (యూదులకు) మధ్య జరిగిన ఒప్పందం. అది తాత్కాలికమైన నిబంధన (యిర్మీయా 31:31-34; హెబ్రీయులకు 8:8-12). క్రీస్తు దానిని "మేకులతో సిలువకు కొట్టి, దానిమీది చేవ్రాతను

తుడిచివేసి, మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసినట్టు” పౌలు చెప్పాడు (కొలొస్సయులకు 2:14), యేసు యొక్క క్రొత్త నిబంధన (మత్తయి 26:28) ప్రభువునకును, క్రైస్తవులకును మధ్య జరిగిన నిబంధన. క్రీస్తు సిలువపై మరణించినప్పుడు యిది అమలులోనికి వచ్చింది (హెబ్రీయులకు 9:16, 17).

పాత నిబంధన పఠనము యింకను విలువైనదిగా ఉంటుంది. పూర్వమున వ్రాసినవి మనకు మేలుకొరకు వ్రాయబడియున్నట్టు పౌలు అన్నాడు: “ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలని ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి” (రోమా 15:4). మనం నేర్చుకొనవలసిన ఉదాహరణలను పాత నిబంధన కలిగియున్నట్టు అతడు చెప్పాడు: “ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను” (1 కొరింథీయులకు 10:11).

క్రైస్తవులుగా మనం పాత నిబంధనతో పరిచయం కలిగియుండడానికి కనీసం ఆరు కారణాలున్నాయి:

1. విశ్వంయొక్కయు మనిషియొక్కయు ఆరంభానికి సంబంధించిన ప్రశ్నలకు బదులిచ్చుటకు.
2. ప్రభువైన యేసుయొక్క దేవత్వాన్ని నిరూపించుటకు.
3. యేసుయొక్కయు, క్రైస్తవ్యంయొక్కయు సాదృశ్య రూపాలను పఠించుటకు.
4. పాత, క్రొత్త నిబంధనల మధ్య పోలికలను గుర్తించుటకు.
5. పాత, క్రొత్త నిబంధనల మధ్యగల ఉపదేశానికి తారతమ్యం చూపడానికి.
6. విధేయత, అవిధేయతల ఉదాహరణలను ఆలోచించుటకు.

ఈ పాఠాలనుండి నీవు పూర్తి విలువ పొంద సహాయపడడానికి ఈ క్రిందివాటిని నీవు చేయవచ్చు:

(1) ఈ పాఠంలోని మెటీరియల్‌కు ఒక నోట్ బుక్ పెట్టుకోవచ్చు, మరియు (2) ఈ మెటీరియల్ శ్రద్ధగా చదువు. లోకంలోని మహా గ్రంథాన్ని కలిసి పరిశీలన చేయటం మహా ఉత్సాహకరంగా ఉంటుంది!